ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

సగం మందికే యూరియా

నిరాశతో వెనుదిరుగుతున్న రైతులు

యూరియా వాడక ఎదగని వరి

ఆందోళనలో రైతులు



యూరియా వెయ్యని కారణంగా ఎదుగుదల ఆగిపోయిన వరి పొలం

ప్రజాశక్తి-గన్నవరం

'యూరియా కొరత లేదు.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు... ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మొద్దు' ఇది ప్రభుత్వం చెబుతున్న మాటలు. వాస్తవ పరిస్థితిలో యూరియా వేయక వరి పొలాలు ఎదుగుదల లేక గిడసమారి కనిపిస్తున్నాయి. ఆ పైరును చూసిన రైతు గుండె బరువెక్కుతోంది. కౌలు రైతు బాధ వర్ణణాతీతంగా ఉంది. కౌలు వేల రూపాయలు కట్టి, సాగుకు వేలాది రూపాయలు అప్పులు చేసి వ్యవసాయం మొదలుపెడితే ఆదిలోనే ఇబ్బందిపడాల్సి వస్తోంది. అది గన్నవరం మండలం వీరపనేని గూడెం పిఎసిఎస్ సొసైటీ. దాని పరిధిలో తెంపల్లి, బల్లి పర్రు, కొత్తగూడెం, వీరపనేని గూడెం, మెట్లపల్లి గ్రామాలు ఉన్నాయి. సుమారు ఐదు వేల ఎకరాల్లో పంటలు వేస్తున్నారు. వరి, వేరుశనగ, మినుము, మొక్కజొన్న పంటలు అధికంగా వేస్తారు. ఖరీఫ్ సీజన్లో మొదటి విడతగా 200 టన్నుల యూరియా రైతులకు అవసరం ఉంది. అయితే ఈ సొసైటీకి వంద టన్నులు మాత్రమే వచ్చిందని సమాచారం. ఇంకా వంద టన్నులు అవసరం. తెంపల్లి, వీరపనేని గూడెం, కొత్తగూడెం గ్రామాల్లో ఎక్కువగా యూరియా వినియోగిస్తారు. ఈ సీజన్‌లో ఎకరానికి ఒక బస్తా యూరియా ఇచ్చినా ఐదు వేల ఎకరాలకు ఐదు వేల బస్తాల అవసరం ఉంది. అయితే ఇప్పటికీ రెండు వేల బస్తాలు మాత్రమే రావడంతో ఒక్కొక్క బస్తా చొప్పున రైతులకు ఇచ్చారు. ఇంకా మూడు వేల ఎకరాలకు యూరియా అందలేదు. మూడు రోజుల క్రితం 400 బస్తాలు సొసైటీకి రావడంతో సమాచారం తెలుసుకున్న రైతులు తెల్లవారుజామున నాలుగు గంటలకే సొసైటీ ముందు క్యూ కట్టారు. 800 మంది రైతులు లైన్లో ఉండటంతో సొసైటీ సిబ్బంది వారిని కంట్రోల్ చేయడం కష్టమైంది. చివరకు వచ్చిన 400 బస్తాలను ఒక్కొక్క రైతుకు ఒక బస్తా చొప్పున మాత్రమే పంపిణీ చేశారు. మిగతా రైతులు, కౌలు దారులు నిరాశతో ఇంటి దారి పట్టాల్సి వచ్చింది. ఆగస్టు 15 తర్వాత వర్షాలు పడటంతో చెరువుల్లోకి నీరు చేరింది. పోలవరం కాలువకు నీరు వదలడంతో ఇంజన్లు వేసి చెరువులకు నీరు మళ్లించారు. చెరువులు నీటితో కళకళలాడటంతో రైతుల్లో ఆశలు చిగురించి సాగు ముమ్మరం చేశారు. ఒకేసారి రైతులంతా సాగు చేపట్టడంతో యూరియా డిమాండ్ వచ్చింది. మొదటి విడతకే ఇంత ఇబ్బంది వస్తే రెండు, మూడు విడతలకు అసలు యూరియా వస్తుందా అన్న సందేహం రైతులను వెంటాడుతుంది. ఎందుకంటే సీజన్లో మూడు విడతలుగా పంటలకు యూరియా వేయడం జరుగుతుందని (మిగతా 2లో)



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

సమృద్ధిగా యూరియా నిల్వలు

కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, యూరియా కొరత ఉందనే దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షం యూరియా కొరత ఉన్నట్లు దుష్ప్రచారం చేస్తోందని, క్యూలో ఉన్న రైతుల ఫోటోలు తీసి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొనడం సరైంది కాదన్నారు. రైతులు యూరియా తీసుకోవడానికి క్యూలో నిలబడితే దాన్ని నేరంగా చూపడం సమంజసం కాదన్నారు. ఎకరాకు రెండు బస్తాల యూరియా చల్లితే సరిపోతుందన్నారు. చాలా మంది రైతులు అధికంగా యూరియా బస్తాలు కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దాని వల్ల అక్కడక్కడ కొంత తగ్గుదల కనిపించిందన్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 1.34 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారని, (మిగతా 2లో)



నిరసన తెలుపుతున్న క్రీడాకారులు

స్టేడియంలో క్రికెట్‌పై ఆంక్షలా?

ఐజిఎంసి వద్ద డివైఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:

విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో క్రికెట్ ఆడేందుకు అధికారులు ఆంక్షలు విధించడం ఏమిటని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రశ్నించారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మొయిన్ ఎంట్రీ గేట్ దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు స్టేడియం అప్పచెప్పడం దుర్మార్గపు (మిగతా 2లో)



వార్త మెయిన్‌లో

విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి గురుపూజోత్సవం కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, పక్కన మంత్రి లోకేష్, ఎంఎల్‌లు బోండా ఉమామహేశ్వరరావు, యార్లగడ్డ వెంకట్రావు

వెంటాడుతున్న సీజనల్ వ్యాధులు

- ప్రతి ఇంట్లోనూ జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- నియంత్రణపై దృష్టి పెట్టని పాలకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రజలను వెంటాడుతున్నాయి. రోజురోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఇంట్లోనూ ఎవరో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. ఈ ఏడాది కృష్ణాజిల్లాలో నమోదైన కేసుల సంఖ్య చూస్తే ఆందోళన కలిగిస్తుంది. జులై నుండి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ జ్వరాల బాధితులు 1,677 మంది నమోదు కాగా, ఆగస్టులో ఈ సంఖ్య 2,307కి పెరిగింది. అంటే సుమారు 600 కేసులు అధికం అయ్యాయి. ఇక టైఫాయిడ్ విషయానికి వస్తే జులైలో 940 మందికి నిర్వహించగా అందులో 241 మందికి పాజిటివ్‌గా తేలింది. ఆగస్టులో 1,462 మందికి పరీక్షలు చేయగా 578 మందిలో పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కేవలం ఒక నెలలోనే టైఫాయిడ్ కేసులు రెట్టింపు అయ్యాయి. ఆరోగ్య శాఖ అధికారులు మలేరియా కేసులు లేవని చెబుతున్నప్పటికీ, మరో వైపు డెంగ్యూ కేసులు భయపెడుతున్నాయి. జులైలో నాలుగు కేసులు నమోదు కాగా, ఆగస్టులో ఈ కేసులు సంఖ్య ఏడుకి పెరిగింది. ఇవి కేవలం ప్రభుత్వ ఆసుపత్రులలో నమోదైన కేసులు మాత్రమే. ఇక్కడే ఈ విధంగా ఉంటే కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కేసులు ఏ విధంగా నమోదు అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఆసుపత్రులకు రాకుండా మందు బిళ్లలతో సరిపెట్టుకునేవారు, ఆర్ఎంపి వైద్యుల దగ్గర చికిత్స పొందేవారు ఇలా చూసుకుంటే పరిస్థితి ఎంత ఆందోళన కారంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



అధ్వానంగా ఉన్న పారిశుధ్యం



రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రిలోని ఒపి విభాగం

పారిశుధ్యం అస్తవ్యస్తం

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యాభై డివిజన్‌లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మురికివాడలు ఉన్నాయి. దీని వల్ల దోమలు అధికంగా వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. తాగునీరు కలుషితం కావడం మరో ప్రధాన కారణం. ప్రస్తుతం జిల్లాలో అనేక చోట్ల ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది. పట్టణం, గ్రామం అని తేడా లేకుండా చెత్త పేరుకుపోవడం, కాల్వలు శుభ్రం చేయకపోవడం, మురుగునీరు పారుదల లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి.

కొరవడిన సమన్వయం

మచిలీపట్నం కార్పొరేషన్‌లో వైసీపీ అధికారంలో ఉంది. రాష్ట్రంలో కూటమి అధికారంలో ఉంది. దీనివల్ల ఇరువురికి సమన్వయం కుదరక ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. మచిలీపట్నం నియోజకవర్గం నుండి మంత్రి కొల్లు రవీంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకరు చెప్పింది మరొకరు చేయకపోవడంతో నియోజకవర్గ స్థాయిలో ప్రజలు పలు మస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్, తాగునీటి సమస్యలు జఠిలంగా ఉన్నాయి.

వ్యాధుల నియంత్రణ చర్యలు శూన్యం

సీజనల్ వ్యాధుల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి. ఆరోగ్య శాఖ అధికారులు కేవలం గణాంకాలు విడుదల చేయడానికే పరిమితం అవుతున్నారు తప్ప ఎక్కడా అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించలేదు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

సగం మందికే యూరియా

రైతులు చెప్పారు. ఎకరాకు రెండు బస్తాలు చొప్పున వేస్తే మూడు సార్లకు ఆరు బస్తాలు కావాల్సి ఉంది. కనీసం ఒక బస్తా చొప్పున వేసినా ఎకరానికి మూడు బస్తాలు కావాలి. ఇప్పటికీ ఒక బస్తానే రైతుకు చేరింది. అది 40 శాతం మందికే. మిగిలిన 60 శాతం మంది యూరియా కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా మాటలు చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో జరుగుతున్న వాస్తవాలను గమనించి యూరియా కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఒక బస్తా కూడా ఇవ్వలేదు : వీర్రాజు, తెంపల్లి



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. అందులో సాగు చేస్తున్న పంటకు వేయడానికి ఒక్క బస్తా యూరియా కూడా అందలేదు. యూరియా కోసం వీరపనేని గూడెం సొసైటీ వద్దకు వెళితే.. యుద్ధమే చేయాల్సి వస్తుంది. అయినా అందని పరిస్థితి. కనీసం మూడు ఎకరాలకు ఒక బస్తా అయినా చల్లుదామని ప్రయత్నిస్తే.. అది కుదరలేదు. ఇతర కాంప్లెక్స్ ఎరువులు వేసి వదిలేసాం. యూరియా దొరకని మాట వాస్తవం.

యూరియా వెయ్యలేదు : కొలుసు దుర్గారావు, తెంపల్లి

యూరియా కోసం సొసైటీ వద్ద పడి కాపులు పడలేక, నిలువు కాళ్లపై నిలబడలేక ఊరుకున్నాం. సొంత పొలం 7 ఎకరాలు ఉంటే,



మరో 17ఎకరాలు కవులకు చేస్తున్నాం. ఐదు ఎకరాల్లో వరి వేస్తుండగా, మిగిలిన పొలంలో వేరుశనగ మినుము వేయడం జరుగుతుంది. ముందుగా వరికి యూరియా వెయ్యాలి. ఆ తర్వాత వేరుశనగకు మినుముకు కొంతవరకు చదువుతాం. వరి పొలానికి వేయడానికి ఒక బస్తా యూరియా కూడా దొరకలేదు. అదేమంటే ఇదిగో.. వస్తుంది అదిగో వస్తుంది.. అని చెప్తున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియా కొంతమందికే సరిపోతుంది. మిగిలిన రైతులకు నిరాశ మిగులుతుంది. యూరియా వెయ్యని కారణంగా వరిలో ఎదుగుదల లోపించింది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సొసైటీలకు యూరియా సరఫరా చేసి కవులు రైతులను ఆదుకోవాలి.

నిరాశే మిగిలింది : గంగాధర్, రైతు

నాకున్నది రెండు ఎకరాల పొలం. అందులోని వరి సాగు చేసుకుని వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నాం. వరి సాగు



చేపట్టి.. యూరియా వేసే సమయానికి అది లేకుండా పోయింది. కో-ఆపరేటివ్ బ్యాంకు వద్దకు వెళితే.. రైతులు కొట్టుకునే సీను కనబడింది. అందరి వలె నేను కూడా తోపులాటలో వెళ్లలేక పోయాను. ఎందుకంటే నాకు ఆరోగ్యం సరిగా ఉండదు. కళ్లు సరిగా కనపడవు. అయినా యూరియా కోసం వెళ్లి రక్త హస్తాలతో వెనక్కి వచ్చాను. పేపర్లలో ప్రభుత్వం యూరియా కొరత లేదని అంటుంటే విని ఆశ్చర్యపోయాను. ఆచరణలో నాకే యూరియా దొరక్క ఇబ్బంది పడుతున్నాను. నాలాంటి రైతులు 30శాతం పైగా ఉన్నారు. ఈ యూరియా కష్టాలు ఎప్పటికి తీరతాయో తెలియడం లేదు. పైగా ఏరియా ఇవ్వాలంటే ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలు, ఆన్లైన్ కాగితాలు కావాలంటున్నారు. ఇది ఎక్కడి గోలో అర్థం కావడం లేదు. మహా ప్రభో యూరియా కట్టలు ఇచ్చి ఆదుకోమని కోరుతున్నా.

సమృద్ధిగా యూరియా నిల్వలు

ఏప్రిల్ మాసంలో 28,773 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఆగస్టు వరకు 27,400 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని చెప్పారు. ఇంకా 1,443 టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీన జిఎఫ్సి నుండి 243 మెట్రిక్ టన్నులు, సిఐఎల్ నుండి 1200 మెట్రిక్ టన్నులు యూరియా జిల్లాకు వచ్చిందన్నారు. యూరియా కొరత వస్తుందేమోనని రైతులు ఆందోళన చెంది అవసరానికి మించి కొనుగోలు చేశారన్నారు. ఎక్కువగా యూరియా వేస్తే భూమి దెబ్బతింటుందని, దీన్ని రైతులందరూ గమనించాలన్నారు. ఈ సమావేశంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ప్రముఖులకు సత్కారం

విజయవాడ : శ్రీ రామకృష్ణ నాట్యమండలి సాంస్కృతిక సేవా సంస్థ స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముగ్గురు ప్రముఖులకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. సంస్థ అధ్యక్షులు జొన్నలగడ్డ జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల నటులు, రచయిత, దర్శకులు, సంగీత నవావధాని రూపశిల్పి బహు నంది అవార్డుల గ్రహీత 'కళారత్న' డాక్టర్ రామలింగ స్వామిని 'రంగస్థలం దీప్తి' పురస్కారంతో, ప్రముఖ సాహితీవేత్త 'కళారత్న' డాక్టర్ జివి పూర్ణచందును 'సాహిత్య దీప్తి' పురస్కారంతో, ప్రఖ్యాత సంగీత విద్వాంసులు, సద్గురు సంగీత సభ నిర్వాహకులు 'కళారత్న' పోపూరి గౌరీనాథ్‌ను 'సంగీత దీప్తి' పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషకు ప్రాణం వంటిదైన పద్యాన్ని అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని అభిలషించారు. సాంస్కతిక కార్యక్రమాల్లో రాణిస్తే జీవితంలో ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, కే పరబ్రహ్మాచారి, చింతా వెంకటేశ్వర్లు, డాక్టర్ పివిఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయిలో



ఏకపాత్రాభినయ పోటీలు ఏకకాలం రెండు వేదికలపై జరిగాయి. సుమారు 80 మంది కళాకారులు మూడు విభాగాల్లో పోటీపడ్డారు. విజేతలకు బుద్ధ ప్రసాద్ తదితరులు బహుమతి ప్రదానం చేశారు.

విద్యా వ్యవస్థలో లోపాలు

అవనిగడ్డ ఎంఎల్ఎ మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-విజయవాడ : నేటి విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టడానికి కార్పొరేట్ విద్యా సంస్థలే ప్రధాన కారణమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కమిటీ ఆధ్వర్యంలో మండలి వెంకట కష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రామ్మోహన్ లైబ్రరీ హాల్లో 'గురుపూజోత్సవం' ఘనంగా జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 112 మంది 'గురుదేవులకు మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సాహితీ సత్కారం' నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ ప్రసంగిస్తూ ఉపాధ్యాయుల వల్లే జాతీయ భావాలు పెంపొందుతాయన్నారు. కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవ్వడానికి లోపభూయిష్ట విద్యా విధానాలే కారణమని గర్హించారు. తనకు ఈమేరకైనా తెలుగు సాహిత్యం పట్ల మమకారం పెరగడానికి నాటి తన టీచర్లు వేసిన పునాదే కారణమని గుర్తుచేసుకున్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎంసీదాస్ 'ఉపాధ్యాయులు - నాడు నేడు' అంశంపై ప్రసంగిస్తూ నాడు విద్యా విధానం పాషన్ అని నేడు ఫ్యాషన్ గా మారిందని విచారం వ్యక్తంచేశారు. నేటి విద్యా విధానంలో కుల, మత, ప్రాంతీయ తత్వాలు ఇత్యాది నేర్చుకోకూడని అంశాలను నేర్చుకుంటున్నారని ఆవేదన చెందారు. విద్య ద్వారా ఉపాధి కల్పనకు- నైపుణ్యాల పెంపు ప్రాతిపదిక విద్యా విధానమే ప్రత్యామ్నాయమని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ వియన్నారావు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకురాలు సీహెచ్ సుశీల విరచిత 'విమర్శ - విహంగం' పుస్తకాన్ని ఈ సందర్భంగా సభలో ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కాజా పూర్ణ చంద్ర గాంధీ, రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచందు, రామ్మోహన్ లైబ్రరీ అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'రగ్ ఉత్సవ్' ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

జైపూర్ రగ్స్ 'రగ్ ఉత్సవ్' ప్రారంభించామని రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌధరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రగ్ ఉత్సవంలో చేతితో తయారు చేసిన 14 వేలకుపైగా రగ్స్ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. ఈ ఏడాది రగ్ ఉత్సవ్-2025లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన కలెక్షన్‌లో ఆలం, జెనెసిస్, సవానా, కన్స్ట్రక్షన్, దా హౌస్, వుండర్‌కమ్మెర్, కాలిడో, క్లాన్, బేసిస్, లాకునా, ఎర్బే, ఇండస్‌బార్, నోమాడిక్ థ్రెడ్స్, అకార్, కాంటూర్ వంటి సిగ్నేచర్ కలెక్షన్‌లు ఉన్నాయన్నారు. గ్రామీణ కళాకారుల ఊహాశక్తి నుంచి నేరుగా పుట్టుకొచ్చిన సుమారు 200 ప్రత్యేకమైన మంచాహా రగ్స్ కూడా ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణ అన్నారు. జైపూర్ రగ్స్ www.jaipurrugs.com.in వెబ్‌సైట్ ద్వారా కూడా అందుబాటులో కలవన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర క్రియాశీలకమని శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని శారదా ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో టీచర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలు, ఉపాధ్యాయ దినోత్సవ విశేషాలను విద్యార్థులు స్కిట్‌లు, స్పీచ్‌ల రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కుందా రామనారాయణ మాట్లాడుతూ జీవితాన్ని ప్రభావితం చేసిన గురువులు, మార్గదర్శులు, తల్లిదండ్రులు, ఇతర ప్రత్యేకమైన వ్యక్తులకు ఎప్పుడూ కతజ్ఞతగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు కేవలం అక్షరాలు మాత్రమే కాదు జీవితాన్ని కూడా ఏ విధంగా ఉన్నతంగా మలుచుకోవాలో దిశానిర్దేశం చేసే గొప్ప వ్యక్తులు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుందా రామనారాయణ చేతుల మీదుగా పలువురు ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో క్రికెట్‌పై ఆంక్షలా?

చర్య అని విమర్శించారు. ఇప్పటికే యువత క్రీడలకు దూరమై ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో డ్రగ్స్, గంజాయి వాడకం విచ్చలవిడిగా పెరిగిందని దీనికి పరిష్కారం క్రీడలను ప్రోత్సాహించడం ఒక్కటే మార్గమని అన్నారు. తక్షణమే ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం బయటపెట్టిన ఆంక్షలు బోర్డు తీసివేయాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను అభివృద్ధి చేయాలని కోరారు. స్టేడియంలో రాళ్లు, గుంతలు ఉన్నాయని వాటిని తొలగించి గ్రౌండ్ ను చదును చేయాలని కోరారు. స్టేడియం బయట వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్టేడియంలో కొంతమంది ప్రైవేట్ కోచ్‌లు ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కోచ్‌ల ఆగడాలకు సంబంధిత అధికారులు అడ్డకట్ట వేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో క్రీడలను కాపాడుకుందాం, ప్లే గ్రౌండ్‌ను రక్షించుకుందాం అనే పిలుపులో యువత భాగసౌమ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు పి.కష్ణ, సోమేశ్వరావు, క్రీడాకారులు రాజేష్, పధ్వి, ఫణింద్ర, రాఘవేంద్ర, లోకేష్, శివ, సాయి, జె.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర : కైలే

ప్రజాశక్తి-పామర్రు : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు సంజీవినిల ఉపయోగపడుతున్న మెడికల్ కాలేజీలు,ఆరోగ్యశ్రీ పథకాలను నిర్వీర్యం చేసేలా తీసుకున్న నిర్ణయాలను పామర్రు మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు తన కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు. సంపద సష్టిస్తా అని డబ్బాలు కొట్టుకుని అధికారంలోకి వచ్చినతర్వాత ఇష్టానుసారంగా అప్పులు చేస్తూ, కమిషన్లు, లంచాల కోసం ఆశపడి ప్రభుత్వ ఆస్తులను తనవాళ్ళకు దఫదఫాలుగా కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వైద్యవిద్యను నిరుపేదలకు దగ్గరచెయ్యడానికి ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ మొదలు పెట్టి, కొన్నింటిని పూర్తిచేశామన్నరు. పేదపిల్లలు కూడా వైద్య విద్యను చదివేలా చేసే సంకల్పంలో ఐదు కాలేజీల (విజయ నగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలలు) నిర్మాణం పూర్తిచేశా మన్నారు.ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటున్న చంద్రబాబునాయుడు చరిత్రహీనుడిగా నిలిచిపోతారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొత్తం 3257 చికిత్సలు రూ.25 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకం వర్తించే విధంగా జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని అన్నారు.ఇ ప్పటికే ఆరోగ్యశ్రీ బకాయిలు దాదాపు రూ.3,750 వేల కోట్లు చెల్లించక పోవడంతో నెట్వర్క్ ఆస్పత్రులు ఇప్పటికే దాదాపుగా సేవలు నిలిపేశాయన్నారు.



శ్రమదానం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

చినముత్తేవిలో శ్రమదానం

ప్రజాశక్తి-మొవ్వ : ఆదర్శ కమ్యూనిస్టు దంపతులు రావూరి అజయ్ కుమార్, విజయలక్ష్మి తతీయ వర్ధంతి సందర్భంగా మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి హైస్కూల్ వరకు సిపిఎం కార్యకర్తలు శ్రమదానం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్డు ను శుభ్రం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, కోసూరు శివ నాగేంద్రం, స్థానిక గ్రామస్తులు రావూరి రమేష్,సిపిఎం మొవ్వ నాయకులు మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, కొనకళ్ల రాంబాబు, వాకా రామచంద్రరావు, సుబ్రమణ్యం, గంగాధరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు వినతి

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వైయస్సార్ ప్రభుత్వ ధర్మార్గపు 1214 మెమోను రద్దు చేయాలని, కమిటీ ఆమోదం జరిగి నిలుపుదల చేసిన క్లైములు, పెండింగ్‌లో ఉన్న కార్డులు ఇవ్వాలని, బిల్డింగ్ కార్మికులకు పనులు కల్పించాలని, అలాగే మెటీరియల్ రేట్లు ప్రభుత్వం తగ్గించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు ఆర్ సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ కొండ, మండల నాయకులు ఓ సీతా రామయ్య, రామనాథం, రామకష్ణ, రాము, సామేలు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ వెనిగండ్ల రాముకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మెడికల్ కళాశాల వద్ద నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : వైసిపి ప్రభుత్వం మచిలీపట్నానికి మెడికల్ కాలేజీ తీసుకొస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కళాశాలను అభివృద్ధి చేయలేక ప్రైవేట్ రంగానికి అప్పగించడాన్ని వ్యతిరేకంగా వైసిపి నాయకులు పేర్ని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ కళాశాల ముందు కార్యకర్తలతో నిరసన వ్యక్తం చేశారు. పిపిపి పద్ధతిలో ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను ప్రారంభిస్తామని చెప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ప్రైవేటు వ్యక్తులను అనుమతిస్తే ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఆసుపత్రులు కూడా కార్పొరేట్ తరహాగా మార్చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ప్రజల పాలిట వైద్యాలయాలుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించవద్దని ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కార్యదర్శి వేము శ్రీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పి పి పి విధానం లో కొత్త మెడికల్ కళాశాల ఏర్పాటు ను చేస్తామని క్యాబినెట్ మీటింగ్ అనంతరం ప్రభుత్వం ప్రకటించడాన్నీ ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ వైద్య రంగంలోకి వస్తే పరిస్థితులు మరింత దారుణంగా ఉంటాయన్నారు. ఇక ప్రభుత్వ వైద్యం సేవారంగంగా గాక సేవా పన్నుల వసూలు రంగంగా మారిపోతుందన్నారు.



నిరసన తెలుపుతున్న పేర్ని కృష్ణమూర్తి, తదితరులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెక్కులు ఇచ్చారు. ఉంగుటూరు మండలం పెద్దవుటపల్లి గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసరావుకు రూ. 2.50 లక్షలు, ఇదే మండలం పొట్టిపాడు గ్రామానికి చెందిన నిమ్మకూరు శ్రీలక్ష్మికి రూ. 2.50 లక్షలు, బాపులపాడు మండలం రేమల్లె గ్రామానికి చెందిన చల్లగుళ్ల లక్ష్మీ పెరుమాళ్లకు రూ. 2 లక్షలు, గన్నవరం మండలం సూరంపల్లి గ్రామా నికి చెందిన గోడెం సాంబశివరావుకు రూ. 2 లక్షలు చొప్పున ఎమ్మెల్యే యార్లగడ్డ సిఫార్సు మేరకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయి.



చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ వెంకట్రావు

యూరియా సరఫరాపై అపోహలొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-పామర్రు: జిల్లాలో యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని రైతులు అపోహలు పోకుండా, భయాందోళన చెందకుండా నిశ్చింతగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం పంట పొలాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. యూరియా కొరత ఉందని భావించి ఆందోళనకు గురవుతున్న రైతులను కలెక్టర్ నేరుగా పలకరించారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. యూరియా సరఫరా, పంపిణీ, వినియోగం స్థితిగతులను ఆరా తీశారు. తొలుత పామర్రు మండలం కురుమద్దాలి ,కనుమూరు ,జుజ్జువరం గ్రామాలలో యూరియా సరఫరాపై రైతుల అభిప్రాయాలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియా కొరత లేకుండా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ ను అన్నదాతలు కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ రైతాంగం ఆందోళన చెందవద్దని, అందరికీ యూరియా సరఫరా చేస్తామన్నారు. ప్రస్తుతం యూరియా కొన్ని చోట్ల అందుబాటులో ఉందని, ఇంకా జిల్లాకు అవసరమైన యూరియా వస్తుందని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



కురుమద్దాలి లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

సాగర్ జలాలతో చెరువులను నింపుకోవాలి : ఆళ్ల

ప్రజాశక్తి-గన్నవరం : నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు తెలంగాణ నుంచి వస్తున్న సాగర్ వరద జలాలతో ఆయ కట్టులోని తాగునీటి చెరువులు నింపుకోవాలని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు ఆయకట్టుదారులకు సూచించారు. నూజివీడు మండలం రావిచర్ల దగ్గర ఉన్న బాపులపాడు మేజర్ రెగ్యులేటర్ నుండి దిగువకు విడుదల అవుతున్న సాగర్ జలాలను ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, నీటి సంఘాల అధ్యక్షులు పల్లగాని వెంకట నాగేంద్రరావు, తమ్మిశెట్టి రాంబాబు, నూజివీడు ఎన్.ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.సీతారావమ్మ, రావిచర్ల సర్పంచ్ కాపా శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు షేక్.జాన్ బా షా ఆయకట్టు ప్రముఖులు అక్కినేని కృష్ణాజి, చింతపట్ల చక్రధర్‌రావు, పామర్తి ఏడుకొండలు, సి హెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోడూరు : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. శుక్రవారం విశ్వనా ధపల్లి గ్రామానికి చెందిన బత్తుల నాగరాజు(46) అవనిగడ్డ వెళ్లి వస్తుండగా రామచంద్రాపురం గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే నాగరాజు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అవనిగడ్డ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



మృతుడు నాగరాజు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిమ్మగడ్డ కృష్ణానది పాయలు వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమయింది. నదిలో కొట్టుకు వచ్చిన మృతదేహం నిమ్మగడ్డ వద్ద ఎత్తిపోతల పథకం సమీపానికి చేరడంతో స్థానికులు గమనించి చల్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. బ్లూ కలర్ ప్యాంట్, బిస్కెట్ కలర్ సారల చొక్కా కలిగే ఉన్న పురుషుని మతదేహం వయసు 45-50 ఏళ్లలోపు ఉండవచ్చు అని అంచనా వేస్తున్నారు. గుర్తుపట్టడానికి వీలు లేకుండా ముఖం, శరీరం పూర్తిగా పాడైపోయింది. మరణించి రెండు వారాలు పైగా అయి ఉండవచ్చు అని భావిస్తున్నారు. వీఆర్వో పెనుమూడి వెంకటేశ్వరరావు శవ పంచనామా నిర్వహించగా చల్లపల్లి ఎస్సై పి ఎస్ వి సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవనిగడ్డ ప్రభుత్వ వైద్యులు సంఘటన స్థలానికి చేరుకొని మతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ఖననం చేశారు

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఇటీవలే విడాకులు తీసుకుని వేరుగా ఉంటున్న భార్యపై భర్త ఉన్మాదిగా ప్రవర్తించిన సంఘటన శుక్రవారం మచిలీపట్నంలో చోటు చేసుకుంది. ఇనకుదురుపేట సిఐ పరమేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం భార్యాభర్తలు పద్మ,శ్రీరామరాజు ఇరువురికి గత నాలుగు నెలల క్రితం విడాకులు మంజూరయ్యాయి. విడాకులు ఇవ్వటంతో భార్యపై కోపం పెంచుకున్న భర్త శుక్రవారం భార్యను హతమార్చలనే పక్కా పథకంతో పూటుగా మద్యం సేవించి సర్కిల్ పేటలోని భార్య ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా, అతి కిరాతకంగా కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన పద్మను కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇనకుదురు పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-కంకిపాడు : మండలంలోని కానూరు లోని సనత్ నగర్ రామాలయం వద్ద వినాయకచవితి సందర్భంగా విగ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గ వైసిపి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పాల్గొని వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా ఆర్టిసన్స్ విభాగం అధ్యక్షులు సైకం చినబాబు, వైసిపి తాడిగడప మున్సిపాలిటీ ఆర్టిసన్స్ అధ్యక్షులు వల్లభనేని మాణికంఠ తదితరులు పాల్గొన్నారు.



శామ్‌సంగ్ నుంచి బిస్పోక్ ఎఐ వాషర్ డ్రైయర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్


అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ ఆధునిక భారతీయ గృహాల కోసం రూపొందించిన తన కొత్త బిస్పోక్ ఎఐ వాసర్ డ్రైయర్‌ను స్వీకరించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.ఈశ్వర్ తెలిపారు. 12 కేజీ వాష్, 7 కేజీ డ్రైవ్ శ్రేణినిని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. శాంసంగ్ కొత్త 12 కేజీ వాషర్ డ్రైయర్ కాంబో, నో-లోడ్ ట్రాన్స్‌ఫర్ సౌలభ్యాన్ని, అన్ని కాలాలకు అనువైన లాండ్రీని, ఇంటెలిజెంట్ ఫ్యాబ్రిక్ కేర్‌ను ఒకే ఇంటిగ్రేటెడ్ యూనిట్‌లో అందిస్తుందన్నారు. ఇది పెద్ద కుటుంబాలు, పట్టణ గహాల కోసం నిర్మించబడిన ఒక స్థలాన్ని ఆదా చేసే ఉపకరణమని పేర్కొన్నారు. శాంసంగ్ బిస్పోక్ ఎఐ వాషర్ డ్రైయర్ల శ్రేణి ఈ మారుతున్న ప్రాధాన్యతలను తీర్చుడానికి రూపొందించబడిందని తెలిపారు. ఇది నో-లోడ్ ట్రాన్స్‌ఫర్ ప్రయోజనాన్ని, ఏడాది పొడవునా అనుకూలమైన ఉతకడం, ఆరబెట్టడాన్ని అందిస్తుందని తెలిపారు.



సేవకు పురస్కారం

ప్రజాశక్తి-గంపలగూడెం

ఏ వ్యక్తి అయినా సమాజానికి మేలు కలిగే పనిని చేపట్టినట్లయితే ఏనాటికైనా అది మంచి ఫలితాలను ఇస్తుంది. అదే స్థానికంగా ఉన్న అడ్వకేట్ గోగిరెడ్డి కృష్ణారెడ్డికి సత్కారం తెచ్చిపెట్టింది. మండల వ్యాప్తంగా, అనుకోకుండా ఎవరైనా మృతి చెందితే.. అతని జ్ఞాపకాలు అంతం కాకుండా, మరొకరికి ఉపయోగపడేలా నేత్రాలను దానం చేయడంలో గోగిరెడ్డి కష్ణారెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇటీవల విజయవాడ ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి వార్షికోత్సవంలో భాగంగా కృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించి, ప్రశంశా పత్రం అందజేశారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ జి.సమరం చేతుల మీదుగా అందుకోవడం విశేషం.



టీచర్ల ఆట - పాట

- లిటిల్ బ్రెయిన్స్‌లో వినూత్నంగా వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

నగరంలోని లిటిల్ బ్రెయిన్ పాఠశాలలో వినూత్నంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఉపాధ్యాయులు నిత్యం పాఠాలు బోధించడం... మార్కులు... విద్యార్థులకు బోధనతో నిత్యం బిజీగా ఉపాధ్యాయులు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం కావడంతో ఆట ...పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి మాట్లాడుతూ తమ పాఠశాల నందు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధన జరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవమైందని, అటువంటి వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను అందరూ గౌరవించాలని అన్నారు. అలాగే ఉపాద్యాయులు నిత్య విద్యార్థులుగా తాను నేర్చుకుంటూ పిల్లలకు బోధించాలని అన్నారు. అపుడే విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుధా ప్రవీణా ముక్తేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.అజయ్ కుమార్



ప్రజాశక్తి-విజయవాడ

విశాఖపట్నంలో డిసెంబర్‌లో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలు, కొండపల్లిలో జరుగుతున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.అజయ్ కుమార్ ముఠా కార్మికులకు పిలుపునిచ్చారు. గవర్నరు పేటలోని బాలోత్సవ భవనంలో ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, వేతనాల పెంపుదల, చట్టాల అమలకు సిఐటియు ఎంతగానో పోరాడుతోందన్నారు. ముఠా కార్మికులకు పని భద్రత కల్పించడంలో సిఐటియు పాత్ర ఎనలేనిదన్నారు. సిఐటియు జాతీయ మహాసభలకు ముఠా కార్మికులు అన్ని విధాలా సహకరించాలని కోరారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల ముఠా కార్మికులకు కష్టాలు పెరిగాయన్నారు. పెద్ద వ్యాపార సంస్థలు, కార్పొరేట్ కంపెనీలలో ముఠా కార్మికుల పనికి అవకాశం లేకుండా చేస్తున్నారని, దీన్ని నిలువరించేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.వి.సుధాకర్, ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీతారాములు, నాయకులు నారాయణ, శ్రీరాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

ఖాళీ బకెట్లతో మహిళల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఆంజనేయ వాగు ప్రాంతంలో మంచినీటి సరఫరా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని వాగు కొండ ప్రాంతంలో మహిళలు ఖాళీ బకెట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కావడం లేదని కొండ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై స్థానిక ప్రజలు సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించకపోవడం బాధాకరమన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని, ప్రత్యేక పైప్ లైన్లు వేసి మంచినీటి సరఫరా రెండు పూటలా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులను డిమాండ్ చేశారు.

కోగంటికి ప్రెస్‌క్లబ్ సభ్యుల సత్కారం

ప్రజాశక్తి-కంచికచర్ల

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోగంటి బాబు కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులకు హామీ ఇచ్చారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇటీవల చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కోగంటి వెంకట సత్యనారాయణను కంచికచర్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోగంటిని విజ్ఞప్తి చేశారు.. కోగంటి బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను సంబంధిత శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవలే కంచికచర్ల సహకార సంఘం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గుత్తా వీర వెంకట రత్నంను కూడా ప్రెస్ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు నన్నపనేని వెంకట దుర్గారావు, చాపా సత్యనారాయణ, గంపా మాధవరావు, బచ్చు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



సమాన పనికి సమాన వేతనమివ్వాలి : సిఐటియు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ కమల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిబాసు అన్నారు. జగ్గయ్యపేట పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ పట్టణంలోని ఉక్కు కళ వేదికపై మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ మహాసభకు కమల, జ్యోతిబాసు హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జగ్గయ్యపేట పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శిగా భక్తుల గుణసుందరి, అధ్యక్షులుగా భక్తుల బుజ్జి, కోశాధికారిగా భక్తుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కోట సమాధానం, సహాయ కార్యదర్శులుగా ఉప్పుతోళ్ల రమణ, పఠాన్ మదర్ ఖాన్, గౌరవ అధ్యక్షులుగా జి నాగమణిలను ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 12 మందితో కమిటీ సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మండల కార్యదర్శి ఎస్.కె గౌస్ మియా, మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

ముసాఫిర్ ఖానా కోశాధికారిగా ఖాదర్

ప్రజాశక్తి -విజయవాడ సిటీ



వన్‌టౌన్ పంజా సెంటర్ సమీపంలోని షా జహుర్ ముసాఫిర్ ఖానా కోశాధికారిగా సయ్యద్ ఖాదర్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపిమ 53వ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ జాహిద్, మరికొందరు నాయకులు, ముస్లిం మైనారిటీ పెద్దలు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో ప్రతిష్టాత్మకమైన ముసాఫిర్ ఖానా కోశాధికారిగా నియమించిన వక్ఫ్ బోర్డుకు, సహకరించిన టీడీపీ ముఖ్య నాయకులకు ఖాదర్ ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు ఉపాధ్యాయుని వనజాక్షికి గురు పురస్కారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో తెలుగు భాషా ఉపాధ్యాయిని పబ్బిశెట్టి వనజాక్షి గురుపూజోత్సవం సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు ఉత్తమ ఉపాధ్యాయ సాహితీ పురస్కారం శుక్రవారం అందుకున్నారు. విజయవాడ రామ్మోహన గ్రంథాలయంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వనజాక్షిని మండలి బుద్ధ ప్రసాద్, ఎఎన్‌యు మాజీ వైస్ ఛాన్సలర్ వియన్నారావు వారిని సత్కరించారు. హెచ్‌ఎం బిహెచ్ హేమలత, ఎస్‌ఎమ్‌సి ఛైర్‌పర్సన్ ఎస్‌కె బాజ్‌బీ, ఉపాధ్యాయులు వనజాక్షిని అభినందించారు.

రంగారావు మాస్టారుకు సన్మానం

ప్రజాశక్తి-కంచికచర్ల

కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో విద్యారంగానికి రంగారావు మాస్టారు చేసిన సేవలు నిరుపమానమైనవని కంచికచర్ల ప్రెస్ క్లబ్ సభ్యులు పలువురు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కంచికచర్ల మార్కెట్ యార్డ్ కార్యాలయంలో కంచికచర్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గంగిరెడ్డి రంగారావు మాస్టార్‌ను కంచికచర్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ తాడపనేని లక్ష్మణరావును కూడా సన్మానించారు. లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి నందిగామ పట్టణానికి చెందిన గురుజు సౌర్య రూ.25116లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంనకు కృష్ణా జిల్లా తోటవల్లూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన లంకే భార్గవ్ గోపాల్ అమ్మవారి నిత్య అన్నదాన పథకానికి రూ.10,116లు విరాళంగా అందజేశారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు



గ్రామాల్లో మద్యం ఏరులైపారుతుంది. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు దందా జోరు పెరుగుతుంది. నందివాడ మండలంలో 22 పంచాయతీలకుగాను ప్రతి గ్రామానికి మూడు నుంచి నాలుగు బెల్ట్ షాపులు ఉన్నాయి. ఎప్పుడో కొన్ని సందర్భాలలో నామమాత్రంగా పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు షాపులు
- పట్టించుకోని పోలీసు, ఎక్సైజ్ శాఖలు

ప్రజాశక్తి-నందివాడ

ప్రోత్సహిస్తున్న వైన్స్ నిర్వాహకులు

మండలంలో నూతలపాడు, కుదరవల్లి, పోలుకొండలో ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చిన అధికారికంగా వైన్స్‌లు ఉన్నాయి. వీటి ద్వారానే మండలంలో వినియోగదారులకు మద్యం సరఫరా చేయాలి. అయితే వైన్‌షాప్ లకు వెళ్లలేని వారు, రాత్రులు వైన్సులు లేని సమయంలో మద్యం అవసరం ఉన్నవారు బెల్ట్ షాపులోనే కొనుగోలు చేస్తున్నారు. వీరికి వైన్స్ నిర్వాహకులు కొండంత అండగా ఉంటున్నారు. మీ దగ్గరికి ఎవరు రారు మేము చూసుకుంటామని భరోసానిస్తున్నారు. వైన్స్ షాపుల నుండి ఒక్కో మద్యం సీసాపై అదనంగా 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు, వినియోగదారుల నుంచి ఒక్కో సీసాపై 30 నుంచి 50 రూపాయలు వసూలు చేస్తున్నారు.

తరచూ గొడవలు..

వైన్ షాపులు రాత్రి పది గంటలకు మూసి వేయడంతో ముందు బాబులు బెల్టు షాపుల్లో కొనుగోలు చేయడానికి వచ్చి తరచూ గొడవలు సష్టిస్తున్నారు. మంగళవారం రాత్రి తుమ్మలపల్లి గ్రామంలో ఓ ఇంటిలో అక్రమంగా సిట్టింగ్ ఏర్పాటు చేసి మద్యం విక్రయించడంతో అక్కడ తాగడానికి వచ్చిన ముందు బాబులు పక్కన ఉన్నటువంటి ఓ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. కాలింగ్ బెల్లులు కొడుతూ వారిని ఇబ్బందులకు గురి చేశారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారులకు ఫోన్ చేసిన ఫోన్లు ఎత్తని పరిస్థితి. స్వయంగా కూటమి పార్టీ నాయకులే బెల్ట్ షాపులు నిర్వహించడంతో ఎటువంటి చర్యలు తీసుకుపోగా వారికి ఎక్సైజ్ శాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అధికారుల కన్నుసనల్లోనే బెల్టు షాపులు


మండల వ్యాప్తంగా ప్రతి నెల బెల్టు షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్‌షాప్ యజమానులు ఎక్సైజ్ శాఖ అధికారులు అండదండ్రులతో మండలంలో గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు నిర్వహిస్తూ వైన్ షాపులు తలపించే విధంగా చేస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తు న్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు వై. కేశవరావు

పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ : ఆదర్శ కమ్యూనిస్టు దంపతులు రావూరి అజయ కుమార్ , విజయలక్ష్మిల తృతీయ వర్ధంతి సభ మొవ్వ మండలం చినముత్తెవి గ్రామంలో శుక్రవారం విజయ్ కుమార్ గృహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా 'వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలు-పరిష్కారం మార్గాలు' అనే అంశంపై రాష్ట్ర రైతు సంఘం నాయకులు వై. కేశవరావు ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు అయినా పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలని, అన్ని పంటలకు మద్దతు కల్పించి రైతులను ఆదుకోవాలని, అమెరికన్ ప్రభుత్వం మన దేశ పంటలకు నష్టాలు కల్పించే విధంగా టారీఫ్ విధానాలు ఉన్నాయని వాటిని వ్యతిరేకించాలని, రైతులందరికీ ఎరువులు పురుగుమందులు సబ్సిడీపై ఇవ్వాలని, రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు మద్దుల బసవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సిపిఎం నాయకులు రావూరి రమేష్, సిపిఎం చినముత్తేవి శాఖ కార్యదర్శి మాదాసు నాగులు, తదితరులు పాల్గొన్నారు. తొలుత రావూరి అజయ్ కుమార్, విజయలక్ష్మి ఫోటోలకు పూల దండలతో నివాళు లర్పించారు.



లడ్డు అందుకుంటున్న సురేష్

గణేష్ లడ్డూలు రూ. 2 లక్షలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలోని విజేత టైలర్ షాపింగ్ వద్ద నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గణేష్ వద్ద పెట్టిన ఏడు 1 లడ్డూలకు వేలంపాట నిర్వహించారు. అందులో రెండు లడ్డూలను 67 వేల రూపాయలకు రియల్ వ్యాపారి ఫణి కుమార్, మరో లడ్డూను భవ్య రియల్ ఎస్టేట్స్ యజమాని పాగోలు సురేష్ బాబు రూ. 27 వేలకు దక్కించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు మల్లికార్జునరావు, పాగోలు రాంబాబు, సగ్గుర్తి ఏడుకొండలు తదితరులు చేతుల మీదుగా లడ్డూలను తీసుకున్నారు. అదేవిధంగా మరో నాలుగు లడ్డులను పట్టణంలోని పలువురు వ్యాపారులు రూ. 1.14 లక్షలకు పాడుకున్నారు. అనంతరం లడ్డూలతో పాటదారులు గ్రామంలో ఊరేగింపు జరిపారు. సాయంత్రం గణేష్ నిమజ్జనం ఊరేగింపు జరిగింది. డప్పుల వాయిద్యాలతో పట్టణం మారుమోగింది.

టూరిజం రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు : కలెక్టర్

ప్రజాశక్తి-ఉంగుటూరు : ట్రావెల్, టూరిజం రంగాల్లో విస్తత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యాలే కెరీర్ వద్ధికి సోపానాలు అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఉంగుటూరు మండలం, ఆత్కూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్నికలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం సందర్శించి ఈ కేంద్రంలో 15 మంది అభ్యర్థులకు ఇస్తున్న ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 28న ప్రారంభం కాగా ఈ నెల 6వ తేదీ శనివారంతో ముగియనుంది. జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆలయాభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థాన పునర్నిర్మాణ పనులకు బోనుల వీరయ్య, విజయలక్ష్మి రూ.10,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాల్ని గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్ వల్లభనేని కష్ణప్రసాద్(నాని)కు శుక్రవారం అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావు పాల్గొన్నారు.



ధర్మరాజును సత్కరిస్తున్న దృశ్యం

ధర్మరాజు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : పంచాయతీరాజ్ జిల్లా శిక్షణాధికారి అబ్బదాసరి ధర్మరాజు సేవలు ఎనలేనివని ఉపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. ఆయన అధ్యర్యంలో పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మరాజును ఘనంగా సన్మానించారు. ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధిని కల్పించిన ధర్మరాజు సేవలు పలువురికి స్ఫూర్తి దాయకమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక లయన్స్ సేవాభవన్ లో ఉపాధ్యాయులను సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులకు రేపల్లెకు చెందిన నాగార్జున నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ వల్లభనేని కష్ణ చైతన్య తండ్రి వల్లభనేని బుచ్చియ్య చౌదరి బస్సులలో ప్రయాణికుల సహాయార్థం ప్రథమ చికిత్సకు అవసరమైన మందుల కిట్టులను అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కే హనుమంతరావుకు అందజేశారు. శుక్రవారం సాయంత్రం అవనిగడ్డ డిపో కార్యాలయం వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఫస్ట్ ఎయిడ్ కిట్లను బస్సులలో నాగార్జున నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో కండక్టర్ దగ్గర ఉండేటట్లుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ హోమ్ నిర్వాహకులు మాట్లాడుతూ నర్సింగ్ హోమ్ యాజమాన్యం వివిధ సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనడమే కాక ప్రజలకు సేవ చేయాలనే ధ్యేయంతో రోగులకు రాయితీతో కూడిన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి అవనిగడ్డ డిపో బస్సులు హైర్ బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిడ్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దివ్య, సిబ్బంది పాల్గొన్నారు



డిపో మేనేజర్ కే హనుమంతరావుకు ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందజేస్తున్న దృశ్యం

జ్వరాలపై సర్వే

ప్రజాశక్తి-పమిడిముక్కల : సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని అమీనాపురం, లంకపల్లి, చొరుగుడి సబ్‌సెంటర్ల పరిధిలో వైద్య సిబ్బంది జ్వరంపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొబ్బరి బోండాల్లో నీళ్ల నిల్వలేకుండా చూడాలని, ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటి కప్పుడు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా అంధత్వ నివారణాధికారిగా డాక్టర్ భానుమూర్తి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :కృష్ణాజిల్లా అంధత్వ నివారణా ఇంచార్జి అధికారిగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ భానుమూర్తి నియమి తుల య్యారు. ప్రస్తుత అంధత్వ నివారణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న నాగజ్యోతి పదోన్నతి పై వెళ్లడంతో ఆమె స్థానంలో భానుమూర్తికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు.





జ్ఞాన సుందరికి ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ గ్లోబల్ పురస్కారం

ప్రజాశక్తి-మైలవరం

మైలవరం మండలం గణపవరం గ్రామానికి చెందిన డాక్టర్ జ్ఞాన సుందరి చేసిన సేవలను గుర్తించి 2025 సంవత్సరానికిగాను ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ పీస్ బ్రాండ్ అంబాసిడర్ ప్రతిభ పురస్కారం అందుకున్నట్లు శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జ్ఞాన సుందరి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ చైర్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ బ్రాండ్ అంబాసిడర్ ప్రతిభ పురస్కారం అందుకున్న జ్ఞాన సుందరిని మైలవరంలోని పలువురు అభినందించారు.

నాగేశ్వరరావుకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల వాగేశ్వరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురూస్, స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ (జిఎస్‌పి) ఎడ్యుకేషనల్ సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత, తెలుగు భాష ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు తెలుగు భాషకు చేస్తున్న విశేషమైన సేవలకు గుర్తింపుగా గురూస్ స్టూడెంట్స్ అండ్ టీచర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా గంఢ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాంబాబు, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు అవార్డు అందుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు.



కొండపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ విఆర్‌కె నగర్ మహిళా, డిస్ట్రిక్ట్ ఉమెన్ క్యాన్సర్ అవేర్నెస్ ప్రోగ్రాం చైర్ పర్సన్, ప్రజా వైద్యశాల వైద్యురాలు డాక్టర్ గంగ విజయవాణి ఆధ్వర్యంలో కొండపల్లిలోని ప్రజా వైద్యశాల వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెగా ఉచిత మెడికల్ క్యాంప్ మహిళల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వైద్య బృందం సహకారంతో నిర్వహించారు. ఈ క్యాంపులో మహిళల్లో వస్తున్న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 350 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, గుండె సంబంధిత వ్యాధులతో పాటు బిపి, షుగర్, ఈసీజీ, ఎకో తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ పిడిజి దేవినేని కిషోర్ కుమార్, విశిష్ట అతిథిగా మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, అతిథులుగా లయన్స్ క్లబ్ పిడిజి దేవినేని జోని కుమారి, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, లయన్స్ జెడ్ సి వి.కష్ణకుమారి, మణిపాల్ డాక్టర్ లక్ష్మీ ప్రియాంక, డాక్టర్ గంగ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యశాలకు సుస్తీ



ప్రజాశక్తి -మైలవరం

ఒకప్పుడు రోగులతో కిటకిటలాడిన ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల నేడు వెలవెలబోతుంది. పల్లెటూర్లలో కూడా రోగులకు హోమియో వైద్యం అందించాలన్న ఉద్యేశంతో ప్రభుత్వం హోమియో వైద్యశాలను రెండు దశాబ్దాల క్రితం మైలవనం మండలంలోని పుల్లూరు జాతీయ రహదారి ప్రక్కన ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలకు పుల్లూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు చంద్రగూడెం, ఏ కొండూరు మండల పరిధిలోని గ్రామాల నుంచి కూడా రోగులు వస్తూ ఉంటారు. వ్యాధిని బట్టి హోమియో మందులను అందజేసేవారు. హోమియో మందులకు పలు రకాల రోగాలు తగ్గడంతో ఆసుపత్రికి మంచి పేరు వచ్చింది. రోజురోజుకు రోగుల సంఖ్యపెరుగుతూ వచ్చింది. ఇక్కడ పనిచేస్తున్న వైద్య అధికారి రెండు నెలల క్రితం బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. ఆ స్థానంలోకి మరో అధికారి రాకపోవడంతో కిందిస్థాయి అధికారి ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. హోమియో వైద్యశాలకు తాళం వేసి ఉండటంతో ప్రతిరోజు రోగులు వచ్చి వెనుతిరిగి వెళ్తున్నారు. కొంతసేపటికైనా డాక్టర్ వస్తారని గంటల తరబడి ఎదురు చూసి చూసి రాకపోవడంతో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రోగులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పుల్లూరు లోని హెూమియో వైద్యశాలకు వైద్యాధికారిని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం ఎమ్మెల్యే సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ పట్టణం ప్రతిభ హైస్కూల్లో రక్తదాన శిబిరాన్ని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం వల్ల మరో ఒక్కరికి జీవితాన్ని ఇచ్చిన వారవుతామని అన్నారు ప్రతిభ హైస్కూల్ యాజమాన్యం షేర్ అలీ మాట్లాడుతూ మీలాద్ ఉన్ నబి మొహమ్మద్ ప్రవక్త జన్మించిన రోజున పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కష్ణ కుమారి, రక్త దాతలు,కూటమి నాయకులు లాయర్ కరీముల్లా, ఏచూరి రాము, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-వత్సవాయి

ఎరువులు కొంటేనే యూరియా కట్టలు ఇస్తామని షరత్తు పెడితే షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి రామ సుబ్బారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అణిగిండ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను డిటి నాగుల మేర, ఎస్ఐ ఎంఎస్ కె.అర్జున్‌తో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో స్టాకు రిజిస్టర్, యూరియా, నిల్వాలు, ఈపాస్ మిషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎరువుల నిల్వాలు, ధరల పట్టిక షాపుల వద్ద డీలర్లు ప్రదర్శించాలని తెలిపారు. రైతులు రెండోసారి యూరియా బదులుగా నానో యూరియా స్ప్రే చేసుకోవాలని సూచించారు.

వినాయక నిమజ్జనంలో విషాదం యువకుడు మృతి

ప్రజాశక్తి - తిరువూరు



తిరువూరు మండలంలోని వామకుంట్ల గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహించిన వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం... గ్రామంలో వినాయ నిమజ్జం చేస్తుండగా పెదగమళ్ల రామకృష్ణ (30), వెంకట నారాయణ నీళ్లలోకి దిగి వినాయకుడిని నిమజ్జనం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు ఇరువురు నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న వారు గమనించి వారిని బయటకు తీసుకొచ్చారు. అప్పటికే రామకృష్ణ మృతి చెందారు. వెంకట నారాయణ పరిస్థితి విషయమంగా ఉండడంతో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నఆ్నరు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనలపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా కట్టలేరు వంతెన

ప్రజాశక్తి-గంపలగూడెం

గడిచిన ఐదు దశాబ్దాలుగా ఆంధ్ర-తెలంగాణ ప్రజలకు సేవలందించిన కట్టేరు వంతెన నేడు ప్రమాదకరంగా మారింది. 20 గ్రాముల ప్రజలు ఈ రహదారిపై నిత్యం ప్రయాణం చేయకపోతే కుటుంబ పోషణ ప్రశ్నార్ధకమే. అటువంటి కీలకమైన కట్టలేరు వంతెన పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారస్తుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. వర్షం వచ్చినప్పుడల్లా 10 నుండి 15 రోజులపాటు ప్రయాణం పూర్తిగా నిలిచిపోవడం, ఆ తరువాత మైనింగ్ యజమానుల వ్యక్తిగత అవసరాల కోసం ఏర్పాటు చేసిన రహదారిపై రాకపోకలు సాగించడం పరిపాటిగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి గానీ, నాయకులకు గానీ చీమకుట్టినట్టు లేదు. నిత్యం స్కూళ్లకు, కాలేజీలకు, వివిధ అవసరాల కోసం పట్టణానికి వెళ్లే ప్రజలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుపై నుంచి ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తుంది. నీటిలో రాళ్లల్లో అడుగు తీసి అడుగేయలేక నానా తంతాలు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కట్టలేరు వంతెనను పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మాణానికి కృషి చేసి ప్రజల కష్టాలు తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రమాదకరంగా వాగును దాటుతున్న స్థానికులు

37 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నవాబ్ పేట, కోణకంచి గ్రామాల్లో ఎస్ఐ కెవి సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్ముత్తున్న గురజాల కృష్ణ మూర్తి, సామినేని రమణరావును అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 37 అక్రమ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఎం.రామ శేషయ్య, సిబ్బంది కె.మధు, సిహెచ్.కేశవరావు పాల్గొన్నారు.

7న దేవస్థానాలు మూసివేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాలను ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుండి మూసివేయడం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్ కె సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరలా 8వ తేదీ ఉదయం 9:30 గంటలు నుండి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభం అవుతుందని తెలిపారు.

స్టీల్ సింక్ బహూకరణ

ప్రజాశక్తి-వత్సవాయి

జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో పొట్టి శ్రీరాములు సేవా ట్రస్ట్ ఆర్థిక సహాయంతో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు మినరల్ వాటర్ ప్లాంట్‌కు కోసం అందజేసిన రూ.35 వేలు విలువ చేసే స్టీల్ సింక్‌ను వత్సవాయి మండల తహశీల్దార్ శు క్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాళ్ల చిన్న సత్యం బాబు, మహిళా సంఘం అధ్యక్షురాలు మోటమర్రి లక్ష్మి, సంఘం మండల అధ్యక్షులు పోలా పూర్ణచంద్రరావు, జిల్లా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శిని గుర్రం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వత్సవాయి

మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామంలోని విద్యుత్ వినియోగదారులకు 6వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా పెనుగంచిప్రోలులో కరెంటు ఉండదని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు, నిరు పేద మహిళలకు, వయోవృద్ధులకు రూ.10 వేలు విలువైన పౌష్టికాహారాన్ని శు క్రవారం అందజేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేసు రామచందర్ సహకారాన్ని అందించగా, శ్రేయస్సు సిబ్బంది లక్ష్మి, ట్రస్ట్ ప్రతినిధులు రాయపూడి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

సమాజ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- గురుపూజోత్సవాల్లో వక్తలు
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



బందరులో గురుపూజోత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

కృష్ణాజిల్లా వ్యాప్తంగా గురుపూజోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పలు పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను వారి చేసిన సేవలకు గుర్తింపుగా సన్మానించారు. అలాగే మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని సమాజంలో గురువుల పాత్రను వివరించారు.

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనలు, రచనలు తరతరాలుగా ప్రభావితం చేస్తున్నాయని రాష్ట్ర కార్మిక, బాయిలర్లు ఫ్యాక్టరీలు బీమా వైద్య సేవల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. శుక్రవారం నగరంలోని జడ్పీ కన్వెన్షన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో ఒక గురువు ఉంటారని, ఒక్కో దశలో వారు ఒక్కో ప్రభావం చూపుతూ ఉంటారన్నారు. రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, రాష్ట్ర గౌడ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, డీఈఓ పి వి జె రామారావు, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, విద్యాశాఖ డిప్యూటీ డీఈవోలు శేఖర్ సింగ్, పద్మారాణి, రవికుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు** : సమాజం అభ్యున్నతికి ఉపాధ్యాయుల బోధనే కారణమని అలాంటి గురువులను సత్కరించుకోవటం గౌరవమని పామర్రు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. బి. వి అప్పారావు పేర్కొన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నవులూరి వెంకయ్య అధ్యక్షతన శుక్రవారం పామర్రు లో ఎస్విఎస్ స్కూల్ ప్రాంగణం లో గురుపూజ నిర్వహించారు. ఉపాధ్యాయులు మురళి కష్ణ, సుబ్బమ్మ, రాము, వెంకటేశ్వరరావు, అరవపల్లి రావు, శివ రామ కష్ణ లను సన్మానించారు. లయన్స్ ప్రతినిధులు బైసాని నాగేశ్వరరావు, పి.ఎం.ఎస్. ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు లంకపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే మానవత సంస్థ ఆధ్వర్యంలో పామర్రు ప్రెసిడెంట్ ఎన్. త్రివిక్రమరావు (ఎన్టీఆర్)అధ్యక్షతన శుక్రవారం పామర్రు శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానప్రాగణంలో జరిగిన గురుపూజోత్సవంలో గురువులు జొన్నలగడ్డ హనుమకుమార్, ఎల్. పుష్ప, దావులూరి రాధాకష్ణ మూర్తి, గాలింకి తాతారావు, కందుకూరి లక్ష్మి కుమారి, యార్లగడ్డ మదుల, శ్రీనివాసరావు, వెంకట నారాయణ లను సన్మానించారు. తెలుగు భాష సేవ ప్రభుత్వ అవార్డు గ్రహీత, మానవత రిజియన్ చైర్మన్ పి.ఏం.ఎస్. ప్రసాద్, జిల్లా ప్రతినిధులు సీతాల ప్రసాద్, పామర్తి వెంకట నారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : బోధన అనేది ఒక సవాలుతో కూడిన వత్తి, దీనికి సహనం, నిబద్ధత, విద్య పట్ల మక్కువ అవసరం అని ముస్తాబాద్ నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమామ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులైన షేక్ జాకీర్ సుల్తానా, షేక్ హసీనా, పి జయశ్రీ, విజయలక్ష్మి,, అశోక్ రాణి, రామభద్ర రాజు రామరాజు, షారుణ్, లిల్లీ, సునీత, కరిష్మా మరియు సుభద్ర లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

ప్రపంచ స్థితిని, స్వరూపాన్ని మార్చగలగేవాడే ఉపాధ్యాయుడని కృష్ణా జిల్లా లైన్స్ క్లబ్ అడిషనల్ కార్యదర్శి ఎంఎల్‌ఏఎస్ఆర్‌కె ప్రసాద్ అన్నారు. గన్నవరం లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం గన్న వరం మండలం దావాజిగూడెం లో ఉన్న స్పందన మాన సిక వికాస కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యా యులుగా సేవలను గుర్తించి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండవ గౌరీ ప్రసాద్, దండమూడి రాధాకష్ణ, సంకాబత్తుల రజిత,జి. సుభాషిని ప్రియ,డి విజయలక్ష్మి లను సత్కరించారు. గన్నవరం లైన్స్ క్లబ్ అధ్యక్షులు డి శ్రీనివా సరావు, సెక్రటరీ శ్రీరామ్ శ్రీనివాసరావు, ట్రెజరర్ చెరుకూరి శీల పాల్గొన్నారు. **ప్రజాశక్తి మొవ్వ:** స్థానిక పెదపూడి జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పామిరెడ్డి కరుణాకర్ రెడ్డిని కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆల్ ఇండియా న్యూస్ పేపర్ ఫెడరేషన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చలాది పూర్ణచంద్రరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ హనుమకుమార్ , సెక్రటరీ బీహెచ్ వీఆర్ఎస్ సాయి , సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, పాగోలు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సింగంశెట్టి ఆదినా రాయణను సన్మానించారు. ఉపాధ్యాయినులు ఎస్.కె రహీమా, ఎస్ సువర్ణ, సిహెచ్ వెంకటేశ్వరమ్మ,డి కమలా దేవి, ఎన్ మహాలక్ష్మి,కె. కుసుమ పాల్గొన్నారు.అలాగే స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులైన సూరపనేని పరంధామయ్య, పోలవరపు రాజశ్రీ, నిమ్మగడ్డ శశికళ లను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పెరుమాళ్ళరావు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జంగం మోహన్ రావు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : టీచర్స్ డే సందర్భంగా విద్యావికాస్ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఎందరో విద్యార్థులను సన్మార్గం లో నడిపి సి ఏ లుగా, ఇంజనీర్లు గా, డాక్టర్ లు గా తీర్చి దిద్ది నటువంటి విద్యావికాస్ గ్రేట్ గురు ముప్పాళ్ల సుబ్బారావు విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యావికాస్ పూర్వ విద్యార్థులు డైరెక్టర్ కొమ్మినేని సాంబశివ రావును దుశ్శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని తెలుపుకున్నారు.. విద్యావికాస్ యజమాన్యం ఉపాధ్యాయ ఉపాధ్యాయ యేతర సిబ్బందికి బహుమతి ప్రదానంతో సత్కారం చేశారు. ప్రైమరీ హెడమాస్టర్ ఆశీర్వాదం, హైస్కూల్ హెడ్ మాస్టర్ చాట్రగడ్డ నాగమల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లి మండలం సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీచర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ ఏ గౌరీ ప్రసాద్, పివిఎల్ రామారావు, డి ఈ డి కృష్ణ జిల్లా సీజీ శేఖర్ సింగ్, ఎమ్ మదీనా భాను, ఎమ్ఈఓ బంటుమిల్లి-1 ఏ వెంకటేశ్వరరావు, కొమ్మారెడ్డి హైస్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ ,స్టేట్ కౌన్సిల్ చైర్మన్ కోమరిగిరి చంద్రశేఖర్, స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ఎస్ ఎన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : భారత మాజీ రాష్ట్రపతి విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా చల్లపల్లి గ్రామపం చాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో టీవీ మాధవేంద్రరావు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశానికి రాధాకష్ణ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాంతి,



గన్నవరం మండలంలోని నవభారత్ స్కూల్లో...



గుడివాడలోని వికాస్ స్కూల్లో...


ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్, పైడిపాముల రాజేంద్ర వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుపూజోత్సవం సందర్భంగా చల్లపల్లి రాజా కళాశాల పూర్వ విద్యార్థులు తమకు విద్యాభివద్ధికి నేర్పించడంతోపాటు సేవాభావాన్ని పెంపొందించిన విశ్రాంత ప్రిన్సిపాల్ టి. సాంబశివరావును సన్మానించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : సమాజ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. అవనిగడ్డ సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండల వెంకటకష్ణా రావు శతజయంతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ జయంతి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవి కష్ణారావు విగ్రహానికి విశ్రాంతి ఉపాధ్యాయులు గుడిసేవ విష్ణు ప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్, బడే వెంకటసుబ్బారావు, అన్నపురెడ్డి నాగ చెంచయ్య, విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, సిహెచ్ రాఘవులు పూలమాలవేసి నివాళులర్పించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ జయంతి సందర్భంగా వారిని కూటమి నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాదివాడ రత్నారావు, ఎఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్:** మచిలీపట్నంలోని నారాయణ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సాయి సుధీర్,ఈ కిడ్స్ కోఆర్డినేటర్ ప్రతిభ, ఈ చాంప్స్ కో ఆర్డినేటర్ లియోని ,ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ డి చందన, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్ దివ్య వాణి, అకడమిక్ డీన్ కె శంకర సాంబశివరావు పాల్గొన్నారు. పాఠశా లలో ఉపాధ్యాయులు మ్యూజికల్ చైర్స్, అంత్యాక్షరి వంటి ఆటలు నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు. **ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక ఏజికే మున్సిపల్ హై స్కూల్‌లో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోబోతున్న ఏ.జి. కె షటిల్ కోర్టు సభ్యులు ఎం.అమ్మన్నబాబు, టి.అప్పారావులను షటిల్‌కోర్డు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడే వెంకటేశ్వరరావు, ఈడే శ్రీనివాసరావు, కె.ఎల్. శ్రీనాథ్, కె.చంద్రశేఖరరావు, వి.మురళి, కె.సతీష్, ఎండి హుస్సేన్‌పాషా పాల్గొన్నారు.


అలాగే స్థానిక సిద్ధార్థ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు చోడవరపు సుకుమార్, దిండిభట్ల సత్యనారాయణమూర్తి, పి రూవతిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చోడవరపు విజయ్ కుమార్, సంస్థ డైరెక్టర్ చోడవరపు సుజాత, ఎన్‌టిఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ పాల్గొన్నారు.



మొవ్వ మండలంలో...



పామర్రు మండలంలో..



బందరులోని నారాయణ స్కూల్లో...



సరళను సన్మానిసుతన్న దృశ్యం

సరళ సేవలకు జిల్లా స్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-గన్నవరం : అంకిత భావంతో పనిచేస్తూ పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్న వీరపనేని గూడెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయిని మాదగని సరళ జిల్లాస్థాయిలో ఉత్తమ టీచర్‌గా శుక్రవారం అవార్డు జిల్లా జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. 2000 సంవత్సరంలో డీఎస్సీ ద్వారా ఈ వత్తి లోకి వచ్చారు. వత్తిని బాధ్యతగా ఇష్టపడి నిత్యం పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ తన జీతం నుండి 10శాతం ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులకు క్రిస్మస్, నూతన సంవత్సరం, బాలల దినోత్సవం, పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. సమాజానికి తన వంతుగా నిర్మల్ హదయ్ వద్ధుల ఆశ్రమం, గుణదల ప్రేమ్ ధాన్ వద్ధుల ఆశ్రమం, నున్న లో మదర్ థెరిసా మెటల్ రిటార్డ్ చిల్డ్రన్ ఆశ్రమం లో భోజనాన్ని అందిస్తున్నారు.



దేవాలయాల కమిటీ చైర్మన్లకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక కాకర్ల వీధిలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం, మెయిన్ రోడ్డులోని శ్రీ ఘంటసాల నాగభూషణం సత్రంల కమిటీలచే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాలస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్‌గా అంగడాల సతీష్, ఘంటసాల సత్రం కమిటీ చైర్మన్‌గా ఘంటసాల అరవింద్, కమిటీ సభ్యులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే రాము కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కూటమి పార్టీల నాయకులు గుత్తికొండ రాజాబాబు, తాతినేని శ్రీనివా సరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-మోపిదేవి : మండల పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామంలోని ఎంపిఎంపిఎస్ పాఠశాలలో మోపిదేవి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు రావి దుర్గాసుధాకరరెడ్డి (రెడ్డి మాస్టారు) తన సొంత ఖర్చుతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాలలో విద్యార్థులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తన స్వంత ఖర్చు 20,000 రూపాయలతో పాఠశాలలో తాగునీటి సమస్యను, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు పనులు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు కొల్లూరి మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ రవికిరణ్‌కు "బెస్ట్ టీచర్ అవార్డు"

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్



పి.బి.సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి డాక్టర్ టి.ఎస్.రవి కిరణ్‌కు బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. టీచర్స్ డేను పురస్కరించుకొని "కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సెస్" వారు 25 సంవత్సరాలుగా విద్యా రంగంలో చేసిన సేవలకు "బెస్ట్ టీచర్ అవార్డును" ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రవి ఈ అవార్డ్ అందుకున్నారు. కళాశాల ప్రధాన అధ్యాపకులు మేకా రమేష్ , డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి జంపాల తదితరులు రవి కిరణ్‌ను అభినందించినారు



కెఎల్‌యులో ఎఐ-డ్రివెన్ క్యాంపస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : కెఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తన క్యాంపస్‌లో జునిపర్ ఎఐ-డ్రివెన్ క్యాంపస్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించడంతో డిజిటల్ పరివర్తనలో ఒక మార్గదర్శక అడుగు వేసింది. ఈ ప్రారంభోత్స వానికి జునిపర్ అకాడమీ గ్లోబల్ హెడ్ అర్చన యాదవ్ ముఖ్య అతిథిగా, ఎడ్యుస్కిల్స్ సీఈఓ శుభజీత్ జగదేవ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంప్ర దాయ నెట్‌వర్కింగ్ ల్యాబ్‌ల మాదిరిగా కాకుండా, ఈ సెంటర్ అఫ్ ఎక్స్లెన్స్ విద్యార్థులకు కత్రిమ మేద -ఆధారిత నెట్‌వర్క్ నిర్వహణ వ్యవస్థలను పరిచయం చేస్తుందని తెలిపారు. కేఎల్ డీమ్డ్-టు-బి యూనివర్సిటీ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఏఐ ఆధారిత నెట్‌వర్కింగ్‌ను సమగ్రపరచడం ద్వారా, ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమలను రూపొందిస్తున్న సాంకేతికతలకు తమ విద్యార్థులు ప్రత్యక్షంగా బహిర్గతమయ్యేలా నిర్ధారిస్తున్నామని తెలిపారు.



ఐతవరం పిఎసిఎస్ చైర్మన్‌గా రామారావు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందిగామ

నందిగామ మండలం, ఐతవరం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ చైర్మన్‌గా మద్దుకూరి రామారావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. నాయకులు మద్దుకూరి రామారావును అభినందిస్తూ, సహకార సంఘం ద్వారా గ్రామ రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రావెల్, టూరిజంలో విస్తృత ఉపాధి అవకాశాలు

- **కలెక్టర్ జి.లక్ష్మీశ**

ప్రజాశక్తి-విజయవాడ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ట్రావెల్, టూరిజం రంగాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ సహకారంతో 15 మంది అభ్యర్థులకు ఇస్తున్న ట్రావెల్ అండ్ టూరిస్ట్ గైడ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఔత్సాహికులకు టూరిజం, ట్రావెల్ గైడ్ అంశాల్లో శిక్షణ నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. నవ్య రాజధాని అమరావతికి ముఖ ద్వారమైన విజయవాడ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యాటక రంగా అభివద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఆయా విద్యాలయాల్లో ఘనంగా జరిగాయి. శ్రీవాహిని కాలేజీలో సంతోష్ ఆటో మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ గురుపూజోత్సవాన్ని నిర్వహిం చింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్ర బాబు, కోశాధికారి ముత్యాల కిషోర్ బాబు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నా రు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాధాకష్ణన్ చిత్ర పటానికి జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యదర్శి ఎల్.గంగాధర్, నాయకులు ఎం.హరికష్ణ, ఎం. సుధాకర్, పి.శీనయ్య, కె.పాపారావు, పి.శోభన్ బాబు తదితరులు పూలమలేసి ఘనంగా నివా ళులు అర్పించారు. లయన్స్ క్లబ్ కార్యాలయం లో కూడా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోండి

- **ధ్యానచంద్ర**

ప్రజాశక్తి-విజయవాడ

వర్షాకాలం దృష్ట్యా తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు అవసరమని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. శుక్రవారం ఉదయం సంబంధితగ అధికారులతో త్రాగునీటి సరఫరాపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా తాగునీటిలో ఎటువంటి లోపం ఉండరాదని, శుద్ధమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయాలని, ఏమైనా తేడాలు గమనించిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొండ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండరాదని, ప్రతి ఒక్కరికి తాగునీటి సరఫరా ఉండేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎఐఐఇఎ పోరాట ఫలితమే జిఎస్‌టి రద్దు

- **ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్**

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్

వ్యక్తిగత జీవితబీమా, ఆరోగ్యబీమా పాలసీలపై 18 శాతంగా ఉన్న జిఎస్‌టిని రద్దు చేస్తూ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం తీసుకున్న నిర్ణయాన్ని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ స్వాగతిస్తుందని యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.కిశోర్ కుమార్ అన్నారు. ఈ విషయమై విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న ఎంబీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్సు ప్రీమియంపై జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండు చేస్తూ గత దశాబ్ద కాలంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) చేసిన పోరాటం విజయం సాధించిందనని తెలిపారు. జిఎస్‌టిని రద్దు చేయాలని కోరుతూ ఇన్సూరెన్స్ ఉద్యోగులు లక్షలాది పాలసీదారుల నుండి సంతకాలను సేకరించి ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌కు అందజేశామని, 2019లోనే నీతి ఆయోగ్ సభ్యులను కలిసి ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. అలాగే 209 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి ఇస్సూరెన్సు ప్రీమియంపై జీఎస్టీ వల్ల కలిగే అనర్థాలను వివరించి రద్దు కోసం కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఎఐఐఇఎ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా చేసిన పోరాటం ఫలించిందని, ఇది ఒక చారిత్రాత్మక విజయమని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ సహాయ కార్యదర్శి ఎన్.ఎం.కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఇ.వి.తులసీరావు, డి.వాసు, సిహెచ్ కళాధర్, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు పి.కృష్ణ, ఎంఎన్ పాత్రుడు పాల్గొన్నారు.

వేగంగా రాజధాని అభివృద్ధి

- **శ్రీకరస్ట్రక్చర్స్ కార్యాలయం ప్రారంభోత్సవంలో మురళీమోహన్**

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



రాష్ట్రానికి ఒకే రాజధాని ఉండాలని, అమరావతి రాజధానినీ కూటమి ప్రభుత్వం ప్రపంచ నగరాలకు పోటీగా తీర్చిదిద్దుతుందని జయభేరి కన్స్ట్రక్షన్ అధినేత, ప్రముఖ నటులు, టిడిపి నేత మురళీమోహన్ తెలిపారు. భూమి మీద పెట్టుబడి పెట్టిన వారెవరు నష్టపోరని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మంచి రోజులు వచ్చాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజయవాడ గురునానక్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీకర స్పేసెస్ అండ్ స్ట్రక్చర్ కార్యాలయాన్ని మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అమరావతి రాజధానిగా అభివద్ధి చెందుతున్న తరుణంలో ఇటువంటి సంస్థలు వెంచర్లు వేయడం వినియోగదారులకు శుభపరిణామమని మురళీ మోహన్ అన్నారు. శ్రీకర స్పేస్ అండ్ స్ట్రక్చర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దేవినేని సుధీర్ మాట్లాడుతూ తమ కార్యాలయాన్ని మురళీమోహన్ ప్రారంభించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని తాను అనేక ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. తాను ఇప్పటివరకు ఐదు ప్రాజెక్టులు చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలియజేశారు. ఓపెన్ ప్లాట్లు, అపార్ట్మెంట్లు, విల్లాస్ సిఆర్‌డిఎ పరిధిలో ఏర్పాటు చేస్తున్నామని, కంచికచర్లలో 30 ఎకరాలతో నవంబర్లో మరో వెంచర్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బుల్లితెర యాంకర్ వర్ష మాట్లాడుతూ తన తల్లితండ్రుల మాట వినకుండా విలాస వస్తువులకు తాను ఖర్చు చేశానని, అదే సమయంలో తన కుటుంబ సభ్యులు భూమిపై పెట్టుబడులు పెట్టారని ప్రస్తుతం అది రెండింతలై మంచి లాభాలు వచ్చాయని అన్నారు. శ్రీకర లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, సంస్థ సిఈవో వై. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు



దుర్గగుడిపై తాగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, దేవీస్ లాబొరేటరీస్ సహకారంతో యాత్రికుల సౌకర్యార్థం దేవస్థానం ఆవరణలో రెండు తాగునీటి శుద్ధి ప్లాంట్‌లను శుక్రవారం ప్రారంభించారు. కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, వారి కుటుంబ సభ్యులతో కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన నీటి ప్లాంట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం అద్దాల మండపం సమీపంలోని ఒకటి, మరొకటి కొత్త పూజా మండపాల దగ్గర గోపికా కృష్ణుల బొమ్మల వద్ద ప్రారంభించబడింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం నిరంతరం కషి చేస్తోందని తెలిపారు.